క్లుప్తంగా

ఘనంగా ధ్వజ స్తంభం ప్రతిష్ట

ఏయూ క్యాంపస్: జీవీఎంసీ 20వ వార్డు పెద వాల్తేరు లాసన్స్‌బే కాలనీలో ఆసంగానంద ఆశ్రమంలోని శ్రీమృత్యుంజయేశ్వర ఆలయంలో ధ్వజ స్తంభ ప్రతిష్ట శుక్రవారం ఘనంగా జరిగింది. విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని ఆలయంలో పూజలు చేసి, ధ్వజస్థంభ ప్రతిష్ట నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ పేర్ల విజయ్‌చందర్, కార్పొరేటర్ మువ్వల లక్ష్మి, పార్లమెంట్ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి బోండా శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నగర కార్యదర్శి చొక్కర శేఖరరావు, మూడు జిల్లాల ఎస్సీ సెల్ ఇన్‌చార్జి అల్లంపల్లి రాజుబాబు, మువ్వల సురేష్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఖైదీ రాజాచంద్ర మృతిపై 7న విచారణ

తగరపువలస: తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా బండ్లగూడకు చెందిన ఖైదీ యడ్ల రాజాచంద్ర (41) ప్రభుత్వ మెంటల్ కేర్ ఆస్పత్రి చికిత్స పొందుతూ ఈ ఏడాది మార్చి 9న మృతి చెందినట్టు వైద్యాధికారులు నిర్ధారించారు. దీంతో రాజాచంద్ర మృతిపై భీమిలి ఆర్డీవో ఎస్.భాస్కరరెడ్డిని విచారణ అధికారిగా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున నియమించారు. ఈ నెల 7న భీమిలి ఆర్డీవో భాస్కరరెడ్డి తన కార్యాలయంలో ఉదయం 11 గంటలకు విచారణ నిర్వహించనున్నారు. రాజాచంద్ర మృతిపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే విచారణకు హాజరై మౌఖికంగా లేదా లిఖితపూర్వకంగా తెలియ చేయాలని భాస్కరరెడ్డి ఓ ప్రకటనలో కోరారు.

సీఎం సహాయ నిధి చెక్కుల అందజేత



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న ఎంపీ

ఎంవీపీ కాలనీ: ముఖ్యమంత్రి సహాయ నిధి కింద లబ్ధిదారులకు విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ చెక్కులు అందజేశారు. శుక్రవారం లాసన్స్ బే కాలనీలోని ఎంపీ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. కొంతకాలంగా 19వ వార్డు పాత జాలరిపేటకు చెందిన కమిడిశెట్టి శేషు(23) గుండెకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్నాడు. ఎంపీ ప్రత్యేక శ్రద్ధతో సీఎం సహాయ నిధి కింద చికిత్స నిమిత్తం ఆర్థిక సాయానికి దరఖాస్తు చేయించారు. ఈ మేరకు మంజూరైన రూ.1.50 లక్షల ఆర్థిక సాయం లబ్ధిదారులకు అందజేశారు. 19వ వార్డు జాలరిపేట ప్రాంతానికి చెందిన మోదుల అప్పలనాయుడు(65) ప్రమాదవశాత్తు ఇంట్లో జారిపడి మరణించడంతో అతని కుటుంబానికి రూ.5 వేలు ఆర్థికసాయం, అదే ప్రాంతానికి చెందిన కదిరి దేవి (30) ఇటీవల మృతి చెందడంతో ఆమె కుటుంబానికి రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

వైద్యుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మహారాణిపేట : వైద్య ఆరోగ్య శాఖలో పలు విభాగాలకు చెందిన వైద్యుల పోస్టులు భర్తీ చేస్తున్నారు. పలు మెడికల్ ఆఫీసర్ పోస్టులు కాంట్రాక్ట్, మెరిట్, రిజర్వేషన్ల ప్రకారం భర్తీ చేస్తున్నట్టు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ పోస్టులను భర్తీ చేస్తున్నామన్నారు. ఇతర వివరాలకు http@//visakhapatnam.nic.in నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. దరఖాస్తుతో పాటు విద్యార్హత నకలు కాపీని ఈనెల 8వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి వారి కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. ఇతర వివరాలు వెబ్‌సైట్‌లో చూడాలని డీఎంహెచ్‌వో తెలిపారు.

ప్రజా రక్షణ భేరికి తరలిరండి

మద్దిలపాలెం : విజయవాడలో ఈ నెల 15న జరిగే ప్రజా రక్షణ భేరి కార్యక్రమానికి తరలి రావాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్కేఎస్వీ కుమార్ పిలుపునిచ్చారు. అసమానతలు లేని సమాజం, రాష్ట్రాభివృద్ధికి ఈ ప్రజా రక్షణ భేరి తలపెట్టామని పేర్కొన్నారు.

ఫిష్ ఆంధ్రా @ తాజా చేపలు



రంగురంగుల టైగర్ రొయ్యలు



రొయ్యలు, పచ్చి నెత్తళ్లు



పీతలు, శీలావతి, రొయ్యలు



డ్రై సీఫుడ్ ప్యాకెట్లు

ఎంవీపీ రైతుబజార్‌లో ప్రత్యేక స్టాల్ ప్రారంభం

ఆరిలోవ: నగరంలోని రైతుబజార్లలో త్వరలో ఫిష్ ఆంధ్రా యూనిట్లు అందుబాటులోకి రానున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం ఎంవీపీ రైతుబజార్‌లో ఫిష్ ఆంధ్రా స్టాల్‌ను ప్రారంభించారు. ఇక్కడ రకరకాల సముద్రం, చెరువు చేపలు లభిస్తాయి. మంచి వాతావరణంతో పాటు ఫిషరీస్ డిపార్ట్‌మెంట్ అధికారులతో ధ్రువీకరించిన నాణ్యమైన, తాజా చేపలు లభించేలా ఫిషరీష్ డిపార్ట్‌మెంట్ అధికారులు చర్యలు చేపట్టారు. ఎంవీపీ రైతుబజార్‌లో దక్షిణ ద్వారం పక్కన ఫిష్ ఆంధ్రా యూనిట్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడ ఐదు షాపులున్నాయి. వీటిలో వినియోగదారులకు బయట మార్కెట్ కంటే తక్కువ ధరకే చేపలు లభిస్తాయని అధికారులు తెలిపారు. సముద్రంలో చేపలు వేటాడిన మత్స్యకారులే ఇక్కడ నేరుగా విక్రయించడానికి ముందుకొచ్చారు. చేపల ధరల పట్టికను అధికారులు ప్రతి షాపు ముందు ఏర్పాటు చేశారు. రోజువారీగా మారుతున్న ధరలను ఆ పట్టికలో రాసి వినియోగదారులకు తెలియస్తారు. శీలావతి, రాగండి, కట్ల, బొచ్చు, కొర్రమేను, మోసు, వివిధ రకాల రొయ్యలు, చందువ, వంజరం, కోనెం, పీతలు, పండుగప్పలు తదితర రకాల చేపలు నిత్యం అందుబాటులో ఉంటాయని ఫిషరీస్ విభాగం అధికారులు తెలిపారు. డ్రై సీఫుడ్ కూడా కిలో, అర కిలో ప్యాకెట్ల రూపంలో విక్రయానికి అందుబాటులో ఉంచారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన అవసరం

ఆరిలోవ: ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన అవసరమని ఆరిలోవ ట్రాఫిక్ ఎస్ఐ కుమార్ తెలిపారు. తోటగరువు హైస్కూల్‌లో ట్రాఫిక్ నిబంధనలపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమ నిబంధనలు గురించి తెలుసుకోవాలన్నారు. అలాగే ఈ నిబంధనలపై ఇంట్లో పెద్దలకు, చుట్టు పక్కల వారికి తెలియజేయాలని ఆయన సూచించారు. రోడ్డుపై నడిచేటప్పుడు, వాహనాలు నడిపినప్పుడు ఏవిధమైన నిబంధనలు పాటించాలో వివరించారు. నిబంధనలు పాటించడం వల్ల రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చన్నారు. ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్ ధరించాలని, కారు నడిపిన వారు సీటు బెల్ట్ బెట్టుకోవాలని చెప్పారు.



తోటగరువు హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ కుమార్

జాబ్ మేళాలో 81 మందికి ఉద్యోగాలు

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రెనింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించిదని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సిహెచ్.సుబ్బిరెడ్డి(క్లరికల్) తెలిపారు. సుమారు 8 ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 305 ఉద్యోగ ఖాళీల భర్తీకి జరిగిన ఇంటర్వ్యూల్లో 186 మంది అభ్యర్థులు హాజరు కాగా.. 81 మంది ఎంపికైనట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. వారికి సుబ్బిరెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు.

శ్మశానవాటిక ఆధునికీకరణకు శంకుస్థాపన



22వ వార్డులో శంకుస్థాపన చేస్తున్న మేయర్ హరివెంకటకుమారి, ఎంపీ ఎంవీవీ



17వ వార్డులో శ్మశానవాటిక పనుల శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎంపీ ఎంవీవీ, తదితరులు

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 17వ వార్డు శివాజీ పార్కు రోడ్డులో ఉన్న శ్మశానవాటిక ఆధునికీకరణ పనులకు ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ శుక్రవారం శంకుస్థాపన చేశారు. స్థానిక నాయకులు, ప్రజల వినతుల మేరకు ఆధునికీకరణ పనులకు రూ.56 లక్షలు మంజూరయ్యాయి. దీంతో పాటు నేతాజీ పార్కు అభివృద్ధికి కూడా ఎంపీ శంకుస్థాపన చేశారు. రూ.17 లక్షల వ్యయంతో పార్కును ఆధునికీకరించనున్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రజలు ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న ఈ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో 17వ వార్డు కార్పొరేటర్ గేదెల లావణ్య, సీనియర్ నాయకులు గేదెల నాగరాజు, జోనల్ కమిషనర్ విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

బీచ్ రోడ్డు: జీవీఎంసీ 22వ వార్డు పీతలవానిపాలెంలో పలు అభివృద్ధి పనులకు శుక్రవారం మేయర్ హరివెంకటకుమారి, ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ శంకుస్థాపన చేశారు. రూ.38 లక్షల నిధులతో శ్మశానవాటిక అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పోలీసు హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ డైరెక్టర్ పీతల గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

'సంక్షేమ పథకాలతో ప్రజల్లో సంతోషం'

ఆరిలోవ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న ప్రజల్లో సంతోషం కనిపిస్తుందని ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ తెలిపారు. జీవీఎంసీ 12వ వార్డులో స్థానిక కార్పొరేటర్ అక్కరమాని రోహిణి, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులతో కలసి ఆయన శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూనగర్‌లో ఇంటింటికీ వెళ్లారు. సంక్షేమ పథకాల వివరాలతో ముద్రించిన కరపత్రాలను పంచిపెట్టారు. ఏ కుటుంబానికి ఏయే పథకాలు ద్వారా ఎంతెంత లబ్ధి చేకూరిందో అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రాష్ట్రంలో పేద, మధ్య తరగతి ప్రజల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు.



నెహ్రూనగర్‌లో మహిళతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీ ఎంవీవీ

ఈ కార్యక్రమంలో ఏపీ మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ పేర్ల విజయచందర్, పార్లమెంట్ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి బొండా శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు సత్తి మందారెడ్డి, కన్నేటి సుబ్బారెడ్డి, చొక్కెర శేఖర్, బోని శివరామకృష్ణ, వాసు, హుస్సేన్, పి.ఐ.బాలరాజు, మోహన్, అర్జున్, సుజాత, సచివాలయం కన్వీనర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నాక్ పర్యటన.. ఏయూలో విస్తృత ఏర్పాట్లు



క్రీడా మైదానాన్ని సిద్ధం చేస్తున్న సిబ్బంది



ఫార్మసీ హాస్టల్



పరిశోధకుల హాస్టల్

ఏయూ క్యాంపస్: నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్(నాక్) మూడు రోజుల పర్యటనకు ఏయూ సిద్ధమైంది. కమిటీ సభ్యులు చూసి మురిసేలా విశ్వవిద్యాలయం పరిసరాలను తీర్చిదిద్దారు. ఇందు కోసం పది రోజులుగా సిబ్బంది అవిశ్రాంతంగా పని చేశారు. వర్సిటీలోని ప్రతి విభాగాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. వారం రోజులుగా ప్రతి విభాగంలో విద్యార్థులు స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. నాక్ కమిటీ పర్యటన నేపథ్యంలో ఆదివారం విశ్వవిద్యాలయం పూర్తి స్థాయిలో పని చేస్తుంది. సిబ్బంది, విద్యార్థులు, ఆచార్యులు విధులకు హాజరవుతారు. ఇప్పటికే దీనిపై స్పష్టమైన ఆదేశాలను అధికారులు విభాగాధిపతులకు జారీ చేశారు. మంగళవారం నాటి టైం టేబుల్‌ని విద్యార్థులకు బోధించనున్నారు.

పరిపాలన భవనానికి విద్యుత్ కాంతులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిపాలన భవనాన్ని ఆధునికీకరించిన అనంతరం విద్యుత్ దీపాలు అమర్చారు. దీంతో ప్రధాన పరిపాలన భవనం ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తోంది. అక్కడ విద్యార్థులు, సిబ్బంది సెల్ఫీలు మురిసిపోతున్నారు.

దొంగలతో జాగ్రత్తగా ఉండాలి

ఆరిలోవ: దొంగల పట్ల జాగ్రత్తగా ఉండాలని ద్వారకా ఏసీపీ వెంకటరావు సూచించారు. ద్వారకా క్రైం విభాగం పోలీసులు పెదగదిలిలో మహిళలకు శుక్రవారం చోరీల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండగలకు ఊరు వెళ్లవారు ఇంట్లో బంగారు ఆభరణాలు, నగదు ఉంచకూడదన్నారు. విలువైన వస్తువులను వెంట తీసుకువెళ్లాలని, లేదంటే బ్యాంక్ లాకర్లలో భద్రపరుచుకోవాలని సూచించారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తులపై నిఘా పెట్టి, అందుబాటులో ఉన్న పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని చెప్పారు. అనంతరం దొంగతనాలు జరిగే తీరుపై, జాగ్రత్తలకు సంబంధించి ముద్రించిన పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో క్రైం సీఐ ఇమాన్యుయేల్ రాజు, ఎస్.ఐ రుక్మంగద రావు, సిబ్బంది పాల్గొన్నారు.



పెదగదిలిలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ద్వారకా క్రైం ఏసీపీ వెంకటరావు

విద్యా సమాచారమ్

ర్యాగింగ్ దుష్పరిణామాలపై అవగాహన



ర్యాగింగ్ నిషేధంపై పోస్టర్లను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఏయూ క్యాంపస్: ర్యాగింగ్ దుష్పరిణామాలు, పర్యవసానాలు, చట్టాలపై అవగాహన కల్పించే విధంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమం శుక్రవారం ఏయూ విద్యా విభాగం ఆధ్వర్యంలో జరిగింది. విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు నేతృత్వంలో విద్యార్థులను భాగస్వాములను చేస్తూ ప్రత్యేక పోస్టర్లను ప్రదర్శించారు. ప్రథమ సంవత్సరం తరగతులు ప్రారంభమైన నేపథ్యంలో ర్యాగింగ్ నిషేధంపై అవగాహన కల్పించారు.

దుర్గాదేవి సన్నిధిలో కుంకుమ పూజలు

ఆరిలోవ: జీవీఎంసీ పదో వార్డు రవీంద్రనగర్ ఆఖరి బస్ స్టాప్ వద్ద దుర్గాదేవి యూత్ ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం అమ్మవారి మండపం ఆవరణలో కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారి అనుపోత్సవ కార్యక్రమం శనివారం జరగనున్నట్లు ఉత్సవం కమిటీ సభ్యులు తెలిపారు.

కృష్ణా గ్రంథాలయానికి పుస్తకాల వితరణ



ప్రిన్సిపాల్ విజయబాబుకు పుస్తకాలు అందిస్తున్న సంస్కృతం అధ్యాపకుడు ఉమామహేశ్వరరావు

మద్దిలపాలెం : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రంథాలయానికి సంస్కృతం అధ్యాపకుడు పోలా ఉమామహేశ్వరరావు పుస్తకాలు సమకూర్చారు. ఈ పుస్తకాలను కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబుకు శుక్రవారం ఆయన అందజేశారు. వక్తృత్వ వికాసానికి, పోటీ పరీక్షలకు, సైకాలజీ, సంస్కృతం, తెలుగు సాహిత్య వంటి పుస్తకాలు అందజేసినట్టు ఉమామహేశ్వరరావు తెలిపారు.

అంతర్ కళాశాలల కబడ్డీ విజేత రఘు కళాశాల

అగనంపూడి: దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన జేఎన్‌టీయూ గురజాడ, విజయనగరం పరిధిలోని కళాశాలల కబడ్డీ పోటీల్లో రఘు ఇంజినీరింగ్ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాల జట్టు రన్నరప్‌గా నిలిచింది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల నుంచి 15 జట్లు పాల్గొనగా ఫైనల్‌లో రఘు ఇంజినీరింగ్ కళాశాల, విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలల జట్లు హోరా హోరీగా తలపడ్డాయి. ముగింపు కార్యక్రమంలో దువ్వాడ కళాశాల రెక్టార్ వి.మధుసూదన రావు మాట్లాడుతూ విజేత జట్లు అంతర్ రాష్ట్ర పోటీల్లో పాల్గొనున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సీఈవో శ్రీకాంత్, ప్రిన్సిపాల్ జె.సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ రవీంద్ర, పీడీ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



విజేత జట్టు రఘు ఇంజనీరింగ్ కళాశాల

25 నుంచి వైజాగ్ జూనియర్ థియేటర్ ఫెస్ట్

బీచ్ రోడ్డు: చిన్నారుల్లో కళాత్మకమైన ఆలోచనలు పెంపొందించేందుకు లిట్ లాంటర్న్ ఫర్ కల్చర్ అండ్ లిటరేచర్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీ నుంచి మూడు రోజుల పాటు వైజాగ్ జూనియర్ థియేటర్ ఫెస్ట్‌ను నిర్వహించనున్నట్టు సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ తెలిపారు. ఈ మేరకు ఫెస్ట్ పోస్టర్‌ను శుక్రవారం సిరిపురంలోని ఒక హోటల్‌లో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మావూరి మాట్లాడుతూ కొన్నేళ్లుగా చిన్నారుల కోసం వివిధ ఫెస్టులు నిర్వహించామన్నారు. ఈ ఫెస్ట్ తొలిసారిగా తెలుగులో ఏర్పాటు చేస్తున్నామన్నారు. కంకటాల మల్లిక్ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. మూడు రోజుల పాటు జరిగే ప్రదర్శనలకు తల్లిదండ్రులు తమ పిల్లలను తీసుకొని రావాలని కోరారు. నిర్వాహకురాలు సంధ్య మాట్లాడుతూ సిరిపురంలోని వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో నిర్వహించే ఈ ఫెస్ట్‌లో ఆర్కే నారాయణ్ రచించిన మాల్గుడి డేస్ కథ, ముంబయికు చెందిన కళాకారులతో తారాస్ ట్రియో, హైదరాబాద్‌కు చెందిన బృందంతో భూమికా థియేటర్స్ ప్రదర్శనలు ఉంటాయన్నారు. ఈ ప్రదర్శనలకు సంబంధించిన టిక్కెట్లు సిరిపురంలోని తనిష్క్ షోరూంలో అందుబాటులో ఉంటాయన్నారు. 27న ఏర్పాటు చేసే తెలుగు ప్రదర్శనకు జీవీఎంసీ స్కూళ్ల విద్యార్థులకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రియా ఉప్పలపాటి, సొనాల్ సర్దా, మాణిక్ రాజ్, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మావూరి వెంకటరమణ, కంకటాల మల్లిక్ తదితరులు

అటల్ టింకరింగ్ ల్యాబ్ ఆకస్మిక తనిఖీ

మధురవాడ: కొమ్మాది రిక్షా కాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను స్టేట్ అటల్ టాస్క్ ఫోర్స్ బృందం శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసింది. బృందంలో అధికారులు ఎస్.వి.రమణ, జిల్లా సైన్స్ ఆఫీసర్ కె.ప్రసాద్, సీహెచ్ గిరిప్రసాద్ పలు అంశాలు పరిశీలించి, ప్రాజెక్టుల గురించి తెలుసుకున్నారు. ల్యాబ్ పరిశీలించి, విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి, సరైన సమాధానాలు చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. మారథాన్, ఇన్నోవేషన్‌లో పాల్గొన్న విద్యార్థినులు, వారి ప్రాజెక్టుల గురించి ఆరా తీశారు. హెల్త్ కోటులో భాగంగా ప్రాజెక్టు నిర్వహించిన 10వ తరగతికి చెందిన సౌజన్యతో మాట్లాడి, ప్రాజెక్టు గురించి తెలుసుకున్నారు. విద్యార్థినుల అవార్డులను, సర్టిఫికెట్లను, ల్యాబ్ రికార్డు నగదు లావాదేవీలను తనిఖీ చేశారు. వర్కుషాపులు, బూట్ క్యాంపులు, రికార్డులు పరిశీలించారు. ఐఎఫ్‌పీ ప్యానెల్ ద్వారా క్లాసులు నిర్వహిస్తూ వాటిని రికార్డు చేయాలని తెలిపారు. వ్యక్తిగత ల్యాబ్ రికార్డులు నిర్వహిస్తూ 15 రోజులకు ఒక్కసారి సంబంధిత అధికారి చేత వెరిఫికేషన్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.నాగమణి, అటల్ ల్యాబ్ ఇన్‌చార్జి శ్రీకాంతి, సైన్స్ టీచర్లను అభినందించారు.

ఎన్టీపీసీ సింహాద్రిలో వెండర్ మీట్ ఏర్పాటు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లో శకుంతలం ఆడిటోరియంలో విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్–2023లో భాగంగా శుక్రవారం వెండర్ మీట్‌ను నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ సంస్థ నుంచి 50 మంది విక్రేత ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి రీజినల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (వెస్ట్–2) సి.శివకుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న మీట్ వెండర్ల సమస్యలను అంచన వేశారు. వివిధ పీఎస్‌యూల్లో సాంకేతికతను ఉపయోగించడంలో ఎన్టీపీసీ ముందంజలో ఉన్నందుకు సింహాద్రి ఎన్టీపీసీ ప్రతినిధులను అభినందించారు. ఈ సమావేశంలో యూఎస్ఎస్‌సీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.కుందు, చీఫ్ జనరల్ మేనేజర్ యు.హెచ్.గోఖే పాల్గొన్నారు.



ఎన్టీపీసీ వెండర్ మీట్‌లో పాల్గొన్న ప్రతినిధులు

గాయత్రీ మంత్ర జపం నేడు

మద్దిలపాలెం: లోక కల్యాణం కోసం కల్వ కొలను చిత్తరంజన్ దాస్ స్మారక సంస్థ ఆధ్వర్యంలో శనివారం అంబికాబాగ్ సీతారామాలయంలో గాయత్రీ శతకోటి మంత్ర జపం నిర్వహించనున్నామని కల్వకొలను శ్రీరామచంద్ర మూర్తి తెలిపారు. భక్తులు హాజరై అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

యోగా పోటీల్లో త్రినాథ్ ప్రతిభ

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ హరగోపాల్ స్కూల్‌కు చెందిన టెన్త్ విద్యార్థి యు.త్రినాథ్ అండర్–17 కేటగిరీ యోగా పోటీల్లో ప్రతిభ చూపాడు. ఆంధ్రప్రదేశ్ స్కూల్ ఎడ్యుకేషన్ విభాగం, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఏపీ ఆధ్వర్యంలో పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం దరి వీరవాసరంలో నిర్వహించిన యోగా(ఆర్టిస్టిక్) విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచాడు. శుక్రవారంతో ఈ పోటీలు ముగిశాయి. రాష్ట్ర వ్యాప్తంగా పలు విద్యా సంస్థల నుంచి పాల్గొన్న వారందరిలో త్రినాథ్ సెకండ్ ప్లేస్‌లో నిలిచి ప్రశంసాపత్రం, మెడల్ అందుకున్నాడు. ఈ సందర్భంగా స్కూల్ యాజమాన్యం, సిబ్బంది త్రినాథ్‌ను అభినందించారు.



యోగాసనంలో హరగోపాల్ స్కూల్ విద్యార్థి త్రినాథ్